క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

వేలేరు : మండలంలో నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓలు బాబు, శరత్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పేర్లు ఎమైనా తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కొత్త పాస్‌బుక్‌లు పొందిన రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, దరఖాస్తుఫారం తీసుకుని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 5 వరకు చివరి తేదీ ఉందని తెలిపారు.

‘రుణమాఫీ’ ఫిర్యాదుల స్వీకరణ

ఐనవోలు : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీకి అర్హులైన రైతులకు మాఫీ కాని పక్షంలో ఎలాంటి ఆందోళన చెందొద్దని ఏఓ కవిత అన్నారు. లక్ష లోపు రుణాలు పొంది ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అమలు కాని రైతుల నుంచి ఫిర్యాదు స్వీకరించేందుకు మండల కేంద్రంలోని రైతు వేదికలో సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు సోమవారం నుంచి సంప్రదించాలని సూచించారు. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సహాయక కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు అందించాలని పేర్కొన్నారు.

పరామర్శ..

నడికూడ : మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేకల రమేశ్ భార్య ఇటీవల మృతిచెందింది. ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూలిన ఇంటిపైకప్పు



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు చిన్నకోటి ఇంటి పైకప్పు వర్షాలకు కూలింది. కూలి పనులు చేసుకునే తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఆర్థికసాయం అందజేత



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన మనిర్వేష్‌రెడ్డి అనే విద్యార్థి ఎంసెట్‌లో ర్యాంక్ సాధించి వరంగల్ కిట్స్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించాడు. ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతుడటంతో మల్లికుదుర్ల మాజీ సర్పంచ్ గొదెల రాజిరెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్థికంగా చేయూతనిచ్చారు. ఆదివారం కొంత ఆర్థికసాయం అందించారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన

రాయపర్తి : మండలంలోని జయరాంతండా(ఎస్)లోని ప్రధాన రహదారిలో బురదమయంగా మారగా గ్రామస్తులు రోడ్డుపై ఆదివారం నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్ మాట్లాడారు. తండా పరిధిలోని సూక్యతండా నుంచి జయరాంతండా(ఎస్) వరకు ఉన్న ప్రధాన రహదారిని ప్రారంభించినా పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలోనే వర్షానికి రహదారి బురదమయంగా మారిందని చెప్పారు. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి రహదారికి మరమ్మతు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాదావత్ బోజ్యానాయక్, అమ్రూనాయక్, బాదావత్ రమేశ్, బాదావత్ శ్రీను, సుమన్, సురేశ్, రమేశ్, సోమ్లా, బాదావత్ లచ్చ, గణేశ్, బుజ్జి, బాదావత్ జూబ్లీ, బాదావత్ వినోద, బాదావత్ భారతి, పద్మ, యాకూబ్, పన్యా తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో నీరు నిల్వకుండా చర్యలు

చెన్నారావుపేట : మండలలలోని ఉప్పరపల్లిలో జనావాసాల్లో వర్షపు నీరు నిల్వకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు జనావాసాల్లో నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతుండగా పత్రికలు సమస్యలు ఆదివారం వెలుగులోకి తీసుకురాగా అధికారులు, కాంట్రాక్టర్ వెంటనే స్పందించారు. నీరు చెరువులోకి వెళ్లేలా జేసీబీతో తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యను పత్రికలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పట్ల కలాం ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాషు మియా, పరికి మధూకర్ హర్షం వ్యక్తం చేశారు. సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని ఆకాంక్షించారు.



హన్మకొండ (పరకాల) : పాఠశాల ఎదుట నిలిచిన వరద నీరు



ఆత్మకూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న చలివాగు



కమలాపూర్ : నీట మునిగిన శ్రీరాములపల్లిలోని కొత్తవాడ



కమలాపూర్ : డివైడర్‌ను ఓపెన్ చేయిస్తున్న ఈఓ

వదలని ముసురు.. పొంగిన వాగులు

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం
- 15.2 ఫీట్లకు చేరిన చలివాగు ప్రాజెక్టు
- శాయంపేటలో 91.1 మిమీ వర్షపాతం
- ఇళ్లలోకి చేరిన వరదనీరు

జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు ఉప్పొంగాయి. చెరువుల్లో వరద నీరు భారీగా చేరి జలకళ సంతరించుకుంది. వరద ఉధృతితో రవాణా కష్టాలు తప్పలేదు. పలు చోట్లు ఇళ్లలోకి వరదనీరు రాగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

హన్మకొండ (పరకాల): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పరకాల మండలంలోని పలు గ్రామాల చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తుండగా మరోవైపు పరకాల చలివాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. చెక్‌డ్యాం మీదుగా వెళ్తున్న చలివాగు చెక్ డ్యాం వంతెనకు 10 ఫీట్ల కింది నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం 6గంటల వరకు పరకాల -భూపాలపల్లి మధ్య రాకపోకలకు ఎలాంటి అంతరాయం చోటుచేసురోనప్పటికీ చలివాగు చెక్‌డ్యాం కింది భాగంలోని మొండి వాగు ప్రవాహంతో దమ్మన్నపేట, రాయపల్లి శివారులోని పంట పొలాలకు రైతులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా కనిపర్తి - పరకాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన మీదుగా వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరకాల నుంచి కనిపర్తి, నాగుర్లపల్లి, లింగాల క్రాస్‌తో పాటు పలు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. పరకాల పట్టణంలోని పలు కాలనీలు జలమయం కాగా ప్రభుత్వ కార్యాలయాల్లోకి సైతం వరదనీరు చేరుకుంది. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంతో పాటు ప్రభుత్వ పాఠశాలలోకి వరద నీరు చేరింది. ఆదివారం సెలవురోజు కావడంతో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరు కాలేదు. అదే విధంగా బ్రాహ్మణవాడ ప్రజలకు వరద కష్టాలు తప్పలేదు. వదరనీరు దిగువ ప్రాంతానికి వెళ్లకుండా కొందరు అడ్డుకట్ట వేయడంతో ఇళ్ల ఎదుట వరద నిలిచింది. దామెర చెరువు మత్తడి నుంచి ప్రవహిస్తున్న వరదను మున్సిపల్ కమిషనర్ నర్సింహాతో పాటు కౌన్సిలర్లు పరిశీలించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని చెరువులు, కుంటలు నిండిపోయి నిండు కుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని 24గ్రామాల్లో ఉన్న 68 చెరువులు, కుంటలు నిండిపోయి మత్తడి పోసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని జోగంపల్లి శివారులో మధ్యతరహ చలివాగు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వచ్చిన వరదతో 15.2ఫీట్ల నీటి మట్టానికి చేరి చలివాగు ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. వరదనీరు పోటెత్తుడంతో ప్రాజెక్టు చిన్న మత్తడి అలుగుపోస్తోంది. వసంతాపూర్‌లోని మొద్దుల చెరువు, జోగంపల్లిలోని బ్రాహ్మణకుంట, సూరంపేటలోని పెద్ద చెరువు, కొప్పులలోని కొత్త కుంట, శాయంపేటలోని తాళ్లకుంట చెరువులు మత్తడి పోస్తున్నాయి. చెరువులు, కుంటలు నీటితో నిండిపోవడంతో సాగునీటి సమస్య తీరిపోనుందని రైతులు ఆనందిస్తున్నారు. తహరాపూర్- సూరంపేట గ్రామాల మధ్య నిర్మించిన లోలెవల్ వంతెన ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ వరద ఉధృతిని పరిశీలించి రోడ్డుకు అడ్డుగా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. తహరాపూర్-సూరంపేట గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : మండలంలో శనివారం సాయంత్ర నుంచి ముసురు వదలడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో మండల కేంద్రం శివారు ప్రాతంలోని పంటపొలాలు నీట మునిగాయి. వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండడంతో స్థానిక పీహెచ్‌సీ ఆవరణలోకి వరదనీరు ప్రవహిస్తోంది. పలు దారులు పూర్తిగా బురదమయంగా మారాయి.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగుతున్నాయి. బ్రాహ్మణపల్లి చెరువు అలుగుపోయగా, నీరుకుళ్ల సమీపంలోని పత్తిపాక రోడ్డులో చలివాగు వరద ఎక్కువ కావడంతో పత్తిపాకకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు పెద్ద చెరువు, కటాక్షపూర్ చెరువులోకి వరద నీరు ప్రవహిస్తోంది. మండల కేంద్రంలోని శిథిలమైన పోలీస్ క్వార్టర్లలో నివసిస్తున్నవారితో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడి బీసీ వసతిగృహంలో పునరావాసం కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు. వరదలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సంతోష్ తెలిపారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం ఆదివారం సాయంత్రం వరకు గెరివివ్వలేదు. దీంతో గ్రామాల్లోకి వరద నీరు పోటెత్తింది. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంపీడీఓ గుండె బాబు సిబ్బందితో కలిసి ఆయా గ్రామాలకు చేరుకుని వరద నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 గంటల వరకు 6.84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొత్తవాడను ముంచెత్తిన వరద నీరు..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని శ్రీరాములపల్లిలోని కొత్తవాడ వరదనీటితో మునిగిపోయింది. పంట పొలాల్లో నిలిచిన వరద నీరంతా కాల్వ ద్వారా హనుమాన్ గుడి, కొత్తవాడ ఇళ్లలోకి చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వరద నీటిని మళ్లించేందుకు చర్యలు..

శ్రీరాములపల్లిలోని కొత్తవాడను వరద నీరు ముచెత్తిందన్న సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంపీడీఓ గుండె బాబు శ్రీరాములపల్లికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. జేసీబీ సాయంతో వరద నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టారు. బస్టాండ్ ప్రాంతంలోని ఓ హోటల్‌లోకి వరద చేరడంతో స్థానిక ఈఓ రమణారెడ్డి పరిశీలించి ముందు జాగ్రత్త చర్యగా వరద నీరు బయటకు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న హుజూరాబాద్-పరకాల మార్గంలోని డివైడర్‌ను రెండు చోట్ల తొలగించారు.



శాయంపేట : నిండు కుండలా చలివాగు ప్రాజెక్టు



శాయంపేట : ముళ్లకంచె వేస్తున్న పోలీస్ సిబ్బంది



హన్మకొండ (పరకాల) : బ్రాహ్మణవాడలో వరద..



ఆత్మకూరు : వరదనీటిలో మునిగిన పత్తిపాక రోడ్డు



ఎల్కతుర్తి : పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు

శాకంబరీగా దర్శనమిచ్చిన అమ్మవారు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో భద్రకాళీ అమ్మవారు భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి కుంకుమార్చనలు, హారతి, మంత్ర పుష్పం సమర్పించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వీరభద్రస్వామి శివాలయంలో షిరిడి సాయినాథుడికి గురుపూర్ణిమ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆశవర్కర్లపై వేధింపులు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

నర్సంపేట : ఆశవర్కర్లపై అధికారుల వేధింపులు మానుకోవాలని ఆశవర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రీన్ రిసార్ట్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా నాయకురాలు కల్వల లలిత అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సంతోష, యువరాజు అతిథులుగా హాజరై మాట్లాడారు. సబ్ సెంటర్ డ్యూటీల్లో జాబ్ చార్ట్‌లో లేకున్నా చేయిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న జనాబాకు అనుగుణంగా ఆశవర్కర్లను నియమించకపోతుండడంతో భారం పడుతోందని చెప్పారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఆశవర్కర్ల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వమే రిజిస్టర్లను ప్రింట్ చేయించి అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న నేషనల్ ప్రోగ్రామ్ అలవెన్స్ రిలీజ్ చేయాలని, ఏఎన్‌సీ టార్గెట్లు తొలగించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఎన్నికల హామీలో భాగంగా రూ.18 వేల చొప్పున వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర నాయకులు భవాని, అనిత, జిల్లా నాయకులు నాగమణి, సంధ్య, మహేశ్వరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్ధన్నపేట : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. తడిసిన విద్యుత్ స్థంభాలను, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను తాకవద్దని సూచించారు. చెట్ల కొమ్మలకు విద్యుత్ లైన్లు తగిలితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని చెప్పారు. తరగతి గదుల్లో స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దని, బయట ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు తడవకుండా చూసుకోవాలని, ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరవేయొద్దని, తెగిన విద్యుత్ తీగలను తాకవద్దని, విద్యుత్ స్తంభం కింద నిల్చుని సెల్ ఫోన్ మాట్లడవద్దని తెలిపారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్లు బయటకు వస్తే విద్యుత్ సిబ్బంది, రోడ్లపై చెట్లు కూలిపోయినపుడు పోలీస్ శాఖకు సమాచారం అందించాలని చెప్పారు. ఆపద సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేసి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

శరీర, అవయవ దానంపై అవగాహన అవసరం



నయీంనగర్: శరీర, అవయవ దానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, కార్డియాలజిస్ట్ దాసరి ప్రసాద్ రావు సూచించారు. గోపాల్‌పూర్ జంక్షన్ ఆదర్శ కాలనీలో సామాజికవేత్త పరికిపండ్ల వేణు స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర నేత్ర, శరీర, అవయవ దాతల ఐక్యవేదిక సమావేశాన్ని కోఆర్డినేటర్ మల్లారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ మరణాంతరం ప్రతిఒక్కరూ తమ నేత్రాలు, శరీర, అవయవాలు దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వర్, కోకన్వీనర్ చల్లా రాంచందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు కరేటి శంకర్‌రావు, శ్రవణ్‌కుమార్, కామిడి సతీష్‌రెడ్డి, రాజు, యుగేందర్, ఐ బ్యాంక్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, రాధాకృష్ణ, విజయ, మహేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్, భిక్షపతి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనాల పండుగ సందడి..



హన్మకొండ (పరకాల) : ఆషాఢమాసం బోనాల వేడుకలను పరకాల పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ నుంచి ప్రధానరోడ్డు గుండా బోనాల ఊరేగింపుతో పాటు నృత్యాలు చేశారు.

కుక్కల దాడిలో వానరం మృతి

అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు

సంగెం : కుక్కల దాడిలో కోతి మృతి చెందిన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వర్షానికి సేదతీరుతున్న కోతిపై కుక్కలు ఇష్టారీతిన దాడి చేయగా అది మృత్యువాత పడింది. దీంతో గ్రామానికి చెందిన ప్రసాద్, నగేశ్, సారంగపాణి, సాంబయ్య, సామ్రాజ్, శ్రీనివాస్, పున్నం రాజు, అనిల్ వానరానికి పాడెకట్టి, గొయ్యి తీసి అంత్యక్రియలు నిర్వహించారు.

అడుగుకో గుంత.. ప్రయాణానికి చింత



గుంతలమయంగా మారిన ఎల్కుర్తి పాఠశాల నుంచి ధర్మసాగర్ వెళ్లే రోడ్డు



శాయంపేట : బుంగ పడిన బీటీ రోడ్డు

వేలేరు (ధర్మసాగర్) : మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో గల బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి బురదమయంగా మారాయి. ఎల్కుర్తి గ్రామంలో నుంచి పాఠశాల వరకు రోడ్డంతా బురదగా మారింది. వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీటి రోడ్డుకు బుంగ

శాయంపేట : మండల కేంద్రం నుంచి మైలారం రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డుకు బుంగ పడింది. పశు వైద్యాశాల సమీపంలో నిర్మించిన కల్వర్టు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరద తాకిడికి ఆదివారం బీటీ రోడ్డుకు బుంగ ఏర్పడింది. ఆర్అండ్‌బీ అధికారులు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టగా సంబంధిత కాంట్రాక్టర్ దేవుని చెరువు నుంచి వచ్చే మత్తడి నీరు తాళ్లకుంటలోకి వెళ్లేందుకు నీటి ప్రవాహం కోసం కల్వర్టు నిర్మాణం చేపట్టాడు. కల్వర్టు ప్రదేశంలో పైపుల మధ్య దూరం ఎక్కువగా పెట్టడంతో వరద తాకిడికి రోడ్డు కోతకు గురై బుంగ ఏర్పడింది. స్థానికులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

ఆలయాల్లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



ఐనవోలు : శ్రీనివాస్, జ్ఞానదేవరెడ్డిని సత్కరిస్తున్న ఈఓ, ఆలయ అర్చక సిబ్బంది



శాయంపేట : అన్నదానం చేపట్టిన ట్రస్ట్ సభ్యులు

ఐనవోలు : మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్‌ను, అదే విధంగా గతంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉప కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందిన ఆర్ జ్ఞానదేవరెడ్డిని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ అర్చక సిబ్బంది శాలువాతో సత్కరించి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ గురువులను పూజించుకునే రోజు గురుపౌర్ణమి అన్నారు. ఉప ప్రధాన అర్చకుడు రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్‌శర్మ, పారాయణదారులు పురుషోత్తమ శర్మ, వినాయక్‌జోషి, అర్చకులు నరేశ్‌శర్మ, దేవేందర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిబాబాకు ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి ఆలయంలో మహా అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్, మర్రిపల్లి గూడెం గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉప్పల్‌లోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మర్రిపల్లిగూడెంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి దేవాలయ ప్రాగణంలోని సాయి బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 108 కలశాలతో పాటు పెరుగు, తేనె , పంచామృతాలతో ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు సాయిబాబాకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో సాయిబాబా సత్సంగ్ మందిరంలో శ్రీసాయి సేవా ట్రస్ట్ పరపతి సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి, మాజీ ఉపసర్పంచ్ సుమన్, భిక్షపతి, శంకరాచారి, రమేశ్, వెంకటపతి, కుమారస్వామి, వేణు, ప్రకాశం, సుమన్, ఆనంద్, రతన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి



రామన్నపేట: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని భద్రకాళి రోడ్డులోని సింహాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం నవ కలశ స్తపన, పంచామృతాభిషేకం, పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్‌తో పాటు స్వామి వారికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు తాటికొండ రాము, వేణుగోపాల్, గోపికృష్ణ, గందె నవీన్‌కుమార్, బుద్ధ జగదీశ్వర్, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.